
సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం | 23 | మార్చి | 2024




ఉత్కంఠగా టెన్నిస్ పోటీలు

భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. IIలో ▸



యాప్‌లతో పరిష్కారం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో సామాన్య పౌరులను సైతం భాగస్వాములను చేస్తూ ఎన్నికల కమిషన్ పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. IIలో ▸



న్యూస్‌రీల్

విద్యుత్ వాహనాలు మేలు



నిట్‌లో మాట్లాడుతున్న సందీప్

తాడేపల్లిగూడెం: పర్యావరణ పరిరక్షణకు భవిష్యత్‌లో విద్యుత్ వాహనాలనే అధికంగా వినియోగించే రోజులు వస్తాయని సింగపూర్‌లోని ఇంజినీర్ లైట్ అన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ మడిశెట్టి అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో శుక్రవారం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, డీఎస్ఐఆర్, సీఆర్‌టీడీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యుత్ వాహనాల పురోగతిలో సవాళ్లు భవిష్యత్తు అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే విద్యుత్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందన్నారు. వాహనాల బ్యాటరీ సామర్థ్యాన్ని మరింతగా పెంచడంతో పాటు లోపాలు తలెత్తకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి టి.రమేష్, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ వి.సందీప్, ఆచార్యులు పాల్గొన్నారు.

96 శాతం విద్యార్థుల హాజరు

భీమవరం: జిల్లావ్యాప్తంగా 127 కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి గణితం పరీక్షకు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. 21,527 మంది విద్యార్థులకు 20,734 మంది హాజరయ్యారన్నారు. అలాగే ఎస్ఎస్‌సీ (ఏపీఓఎస్ఎస్) పరీక్షకు 830 మందికి 729 మంది, ఇంటర్మీడియెట్ (ఏపీఓఎస్ఎస్) పరీక్షకు 810 మందికి 738 మంది అభ్యర్థులు హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారం



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

సాక్షి, భీమవరం: ఎన్నికల వేళ రాజకీయంగా లబ్ధిపొందాలన్న దుర్బుద్ధితోనే విశాఖ డ్రగ్స్ ఘటనపై చంద్రబాబు, టీడీపీ నాయకులు సోషల్ మీడియాలో ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మండిపడ్డారు. శుక్రవారం భీమవరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ డ్రగ్స్ స్మగ్లింగ్ వ్యవహారంలో చంద్రబాబు, లోకేష్ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బంధువులకు చెందిన డ్రగ్స్ పట్టుబడిన కంపెనీతో సంబంధాలున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కేసులోని నిందితులకు టీడీపీ నాయకులకు ఉన్న సన్నిహిత సంబంధాలు సీబీఐ దర్యాప్తులో బట్టబయలవుతాయన్న భయంతో తప్పుడు ప్రచారానికి తెరలేపారన్నారు. టీడీపీ హయాంలో గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై నామమాత్రంగానే సోదాలు నిర్వహించేవారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున దాడులు నిర్వహించడం ద్వారా అక్రమార్కుల భరతం పడుతున్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. చంద్రబాబు దుష్ప్రచారాన్ని నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్సీ కవురు స్పష్టం చేశారు.

ప్రపంచ జల దినోత్సవం



నినాదాలు చేస్తున్న అధికారులు

ఏలూరు(మెట్రో): మానవ జీవనానికి నీరు ప్రధానమైందని, దానిని పొదుపుగా వాడుకోవడం అందరి కర్తవ్యం అని జలవనరుల శాఖ డీఈఈ వై.అర్జున్ అన్నారు. ఏలూరులో శుక్రవారం జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ నీటి ఆవశ్యకతను తెలియజేశారు. విచ్చలవిడిగా నీటిని వినియోగించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతాయని తద్వారా భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే భూగర్భ జలాలు పెంపొందించే చర్యలు సైతం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

కోడ్ ఉల్లంఘనలపై చర్యలు

ఏలూరు(మెట్రో): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఎటువంటి ఉల్లంఘనలకు తావులేకుండా ఉండాలని ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితో కలిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి, సీ-విజిల్, కంట్రోల్ రూమ్ నిర్వహణ, ప్రతికూల వార్తలపై చర్యలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో అమలవుతున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి సందర్భంగా తీసుకోవాల్సిన, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఎంసీసీ ఉల్లంఘనపై కఠినంగా వ్యవహరించాలన్నారు.

సీమ నేత మాకొద్దు

'పుట్టా మహేష్ ఎవరు.. మన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వ్యక్తేనా.. ఏలూరు టీడీపీ రాజకీయాల్లో ఉన్న అతనేనా.. యనమల అల్లుడని టికెట్ ఇస్తే ఆయనన్నే వచ్చి పనిచేసుకుని గెలిపించుకోమనండి.. మాకేమి సంబంధం..' ఇది ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ గురించి టీడీపీ నేతల వాట్సాప్‌ల్లో జరుగుతున్న చర్చ.

'జిల్లాలో బీసీలే లేనట్టు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరేడు జిల్లాలు దాటి వైఎస్సార్ కడప నుంచి పుట్టా మహేష్ యాదవ్‌ను ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం ఏంటి'.. ఇదీ పుట్టా మహేష్ ఎంపికపై టీడీపీ నేతల ఆగ్రహం.

'కడప నేతలు వద్దు.. దిగుమతి నాయకులను తీసుకువస్తే కచ్చితంగా తిప్పికొడతాం.. ఆత్మవంచన చేసుకుని పనిచేసేది లేదు.. అధిష్టానంతో తాడోపేడో తేల్చుకుంటాం.' విలేకరుల సమావేశంలో బీజేపీ నేతల హెచ్చరిక.

- ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పుట్టా మహేష్
- అసమ్మతి గళం వినిపించిన ఆశావహులు
- బాబు సొంత సామాజికవర్గ నేతలకూ తీవ్ర పరాభవం
- టికెట్ కోసం యత్నించి భంగపడిన సీనియర్లు
- మిత్రపక్షం బీజేపీలోనూ టికెట్ రగడ



సాక్షి ప్రతినిధి,ఏలూరు: తెలుగుదేశం పార్టీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన పుట్టా మహేష్ యాదవ్‌ను ప్రకటించడంపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తెలుగుదేశం పార్టీలో టికెట్ ఆశించి భంగపడిన నేతలు తీవ్రస్థాయిలో అసమ్మతి గళం విప్పగా, మిత్రపక్షమైన బీజేపీ నేతలు కూడా ఇదేమి నమ్మకద్రోహం అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. మొత్తంగా ఏలూరు ఎంపీ అభ్యర్థి ప్రకటన కూటమిలో సరికొత్త చిచ్చు రగిల్చింది.

గోపాల్‌కు మొండిచేయి : ఏలూరు ఎంపీ టికెట్‌ను ఆశిస్తూ మాజీ ఎంపీ మాగంటి బాబుతో సహా చంద్రబాబు సొంత సామాజికవర్గ నేతలు ముగ్గురు బలంగా ప్రయత్నించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి 2019 వరకు బాబు సామాజిక వర్గానికే ఇక్కడ ఎంపీ టికెట్ ఇస్తూ వచ్చారు. ఈసారి కూడా అలాగే ఇస్తారని సొంత నేతలు ముగ్గురు, బీసీ సామాజిక వర్గానికి ఇచ్చి ఎన్ఆర్ఐ గోరుముచ్చు గోపాల్ యాదవ్ హడావుడి చేశారు. సింగపూర్‌లో గోపాల్ యాదవ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. వ్యాపారాలను పక్కనపెట్టి సొంత మండలమైన కామవరపుకోట నుంచి ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడాదిగా కార్యక్రమాలు నిర్వహించారు. అది కూడా చంద్రబాబు, లోకేష్ సూచనల మేరకు విపరీతంగా ఖర్చు చేశారు. బీసీ డిక్లరేషన్, జయహో బీసీ, చంద్రబాబు, లోకేష్ పర్యటనలు ఇలా ఏడాదిగా ఆయన్ను గట్టిగా వాడుకుని చివరికి టికెట్ విషయంలో టీడీపీ పెద్దలు మొండిచేయి చూపించారు. కనీసం నెల రోజుల నుంచి చంద్రబాబు అపాయింట్‌మెంట్‌కు ప్రయత్నించినా ఇవ్వని పరిస్థితి. టికెట్ మీదేనంటూ యనమల రామకృష్ణుడు మభ్యపెట్టి చివరిలో హ్యాండ్ ఇచ్చి తనను రాజకీయంగా దెబ్బతీశారంటూ గోపాల్ యాదవ్ సోషల్ మీడియాలో వీడియో రిలీజ్ చేశారు. ఈనెల 25న కామవరపుకోటలో దగాపడ్డ బీసీ సోదరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇక జిల్లాలోని బడా రాజకీయ కుటుంబమైన మాగంటి బాబుకూ భంగపాటు తప్పలేదు. పార్టీలో ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ పనిచేస్తున్నా కనీసం సమాచారం కూడా చెప్పని పరిస్థితి. ఇక అపాయింట్‌మెంట్ సంగతి సరేసరి.

జిల్లాతో ఎలాంటి సంబంధం లేకుండా..

ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు మహేష్‌ను ప్రకటించారు. జిల్లాకు ఎటువంటి సంబంధం గాని, పరిచయం గాని, గత ఐదేళ్లలో ఒక్కసారైనా జిల్లాకు గాని వచ్చిన లేదా జిల్లా టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు మహేష్‌కు లేవు. కనీసం ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం హద్దులు తెలియని టీడీపీ నేత కుమారుడికి టికెట్ ఇవ్వడంపై తీవ్ర విమర్శలపర్వం ప్రారంభమైంది.

బీజేపీ నేతల అల్టిమేటం

కడప నేతలు వద్దు.. స్థానిక బీజేపీ నేతలకే టికెట్ ఇవ్వాలని బీజేపీ జిల్లా నేతలు అల్టిమేటం ఇచ్చారు. పొత్తుల్లో టికెట్ వస్తుందని ఆశించిన బీజేపీ నేత తపన చౌదరికే టికెట్ ఇవ్వాలని, దిగుమతి నేతలను తీసుకువస్తే కచ్చితంగా తిప్పికొడతామని ఏకపక్షంగా అభ్యర్థిని ప్రకటించడంపై బీజేపీ పార్లమెంట్, నియోజకవర్గాల కన్వీనర్లు విలేకరుల సమావేశం నిర్వహించి హెచ్చరించారు. ఆత్మవంచన చేసుకుని టీడీపీకి పనిచేసేది లేదని, అధిష్టానంతో తాడోపేడో తేల్చుకుంటామంటూ కూటమిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పాలన



మల్లవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మల్లవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి సీఎం జగన్ చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని, గత ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన అమలు చేసిన హామీలను వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. విద్యా, వైద్యం, సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముదునూరి శ్రీకృష్ణంరాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోని, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, దొంగ మురళీమురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబాన్నీ ఆదుకున్న ముఖ్యమంత్రి



కోపల్లెలో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్

కాళ్ల: రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఉండి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. మండలంలోని కోపల్లె, బొండాడ గ్రామాల్లో శుక్రవారం పార్టీ నాయకులతో ఆయన సమావేశాలు నిర్వహించారు. గతంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ పథకాలు అందించారన్నారు. మరలా జగన్ ముఖ్యమంత్రి అయితే ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. సచివాలయ వ్యవస్థ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ పథకం పరిధి పెంపు, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాల అమలు తదితర కార్యక్రమాలు చేయగలిగారన్నారు. సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి చేయగలిగామన్నారు. బీసీలకు పార్టీలో అధిక ప్రాధాన్యమిచ్చారని, నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బీసీ మహిళను నిలబెట్టి చిత్తశుద్ధి చాటారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కోపల్లె, బొండాడ గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చంద్రబాబు అధికారం కోసం పొత్తులు పెట్టుకుని ప్రజలను మోసం చేసేందుకు కల్లబొల్లి హామీలు ఇస్తూ వస్తున్నారని, ఎవరూ నమ్మవద్దని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, నాయకులు ఉన్నారు.

'ఓపెన్' పరీక్షలకు 1,232 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సులకు జిల్లాలో శుక్రవారం పరీక్షలు జరిగాయి. పదో తరగతి గణితం పరీక్షకు 971 మందికి 833 మంది, ఇంటర్మీడియెట్ గణితం పరీక్షకు 444 మందికి 399 మంది హాజరయ్యారు. జిల్లాస్థాయి పరిశీలకులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ కమిటీ సభ్యులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముదినేపల్లిలోని సహాయ మాత ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైనట్టు ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. జిల్లాలో గణితం పరీక్షకు 24,133 మంది రెగ్యులర్ విద్యార్థులకు 23,451 మంది, ఫెయిలైన విద్యార్థులు 5781 మందికి 3,682 మంది హాజరయ్యారన్నారు.

గ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు



ఆలమూరులో మహిళలకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఆలమూరులో రూ.48.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు 1,200 కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందించామని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం ఆలమూరు, కొయ్యేటిపాడు గ్రామాల్లో ఆయన ఎన్నికల శంఖారావం ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల, ఆచంట ఎమ్మెల్యేగా తనను గెలిపించి జగన్‌ను మరోసారి సీఎం చేయాలని అభ్యర్థించారు. ఆలమూరులో రూ.26 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.23 కోట్లతో సంక్షేమ పథకాలు అందించామన్నారు. మరలా పథకాలు కొనసాగాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పెన్మెత్స విశ్వనాథరాజు, ఆలమూరు, కొయ్యేటిపాడు సర్పంచ్‌లు మేడపురెడ్డి వెంకటరమణ, కర్రి ముని రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పలివెల ఆశాలత, గడ్డం ఈశ్వరుడు, సొసైటీ అధ్యక్షుడు కోదండరమణారెడ్డి ఉన్నారు.

ప్రచార ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

కలెక్టర్ సుమిత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

భీమవరం(ప్రకాశం చౌక్): అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యం సార్వత్రిక ఎన్నికల ప్రచార సామగ్రి ప్రింటింగ్, ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి పొందాల్సిన అనుమతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ దృష్ట్యా వాహనాలు, లౌడు స్పీకర్లు, ర్యాలీలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారానికి 24 గంటల ముందు అనుమతి పొందాలన్నారు. ఆర్ఓకు నేరుగా లేదా సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందవచ్చన్నారు. అనుమతులు పొందకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవన్నారు.

ప్రచార సామగ్రికి.. రాజకీయ పార్టీలు ప్రచార సామగ్రికి సంబంధించి ముందుగానే కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ కమిటీ నుంచి అనుమతి పొందిన తర్వాతే కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు తయారు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలు రాజకీయ పార్టీల నుంచి అనుమతి పత్రం తీసుకున్న తర్వాతే ప్రింటింగ్ చేయాలన్నారు. ఏప్రిల్ 17 వరకు చేసిన ఖర్చులను సంబంధిత పార్టీల ఖాతాలో జమచేస్తామని, అభ్యర్థులు నామినేషన్లు వేసినప్పటి నుంచి అయిన ఖర్చులను అభ్యర్థులకు జమ చేస్తామన్నారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా రాష్ట్రవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుపరిచే అంశానికి సంబంధించి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య పాల్గొన్నారు.

ప్రజలంతా సీఎం జగన్ వెంటే..



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్ పాలనపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారని పాలకొల్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్లవానిపాలెం, పెచ్చెట్టిపాలెం, గొల్లవానిచెరువు ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్ ఎన్నికయితేనే సంక్షేమ పథకాలు అందుతాయనే భావనతో ప్రజలంతా ఉన్నారని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఎమ్మెల్యే నిమ్మలకు పరాభవం తప్పదు

ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు శిలాఫలకాలు వేసుకున్నారే తప్ప డ్రెయిన్లు, రోడ్లు నిర్మించలేదని గుడాల గోపి విమర్శించారు. ఈసారి ఎమ్మెల్యే నిమ్మల ఇంటికెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి పోటీచేసినా సీఎం జగన్‌ను ఎదుర్కోలేరన్నారు. రానున్న రోజుల్లో మరింత సంక్షేమం అందించేలా మేనిఫెస్టో రూపొందిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, గుంటూరు పెద్దిరాజు, సర్పంచ్ పెన్మెత్స పద్మ, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, నాయకులు ఉన్నారు.

ప్రజల జీవన ప్రమాణాల మెరుగు



భీమవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలో మావుళ్లమ్మను దర్శించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పోలీసు బొమ్మ సెంటర్ మీదుగా ఇండియన్ బ్యాంకు రోడ్డుకు చేరుకుని, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, శివాలయం, మారుతి టాకీస్ వద్ద ఆంజనేయస్వామిగుడి, వినాయకుడిగుడి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలను, వృద్ధులను ఓట్లు అభ్యర్థించారు. అలాగే బస్సులు, ఆటోలు, కారులు, బైక్‌లపై ప్రయాణిస్తున్న వారిని సైతం ఓట్లు అడిగారు. రెండు ఓట్లను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లిబాబు, ఎంపీపీ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్‌రాజు, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, గ్రంధి రవితేజ తదితరులు ఉన్నారు.

కమనీయం.. కడు రమణీయం

పెద్దింట్లమ్మ ఆలయంలో కల్యాణోత్సవం

కైకలూరు: చూసిన కనులదే భాగ్యమూ అనే రీతిలో కొల్లేటికోటలో జలదుర్గా, గోకర్ణేశ్వరుని కల్యాణం గురువారం అర్ధరాత్రి వైభవంగా జరిగింది. పెద్దింట్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి కల్యాణానికి సమీప జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలో గోకర్ణేశ్వరపురంలో ఉన్న గోకర్ణేశ్వరస్వామిని పల్లకిలో ఊరేగిస్తూ కొల్లేటికోటకు తీసుకొచ్చారు. ఆ సమయంలో పల్లకి మోయడానికి వందలాది మంది పోటీపడ్డారు. సీఐలు బి.కృష్ణకుమార్, ఆకలు రఘు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ప్రదక్షిణలు అనంతరం గోకర్ణేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు పేటేటి వెంకట నాగేశ్వరరావు దంపతులు కల్యాణ పీటలపై కూర్చున్నారు. రాము గురుక్కల్ (తెనాలి), కె.విశ్వేశ్వరశర్మ (పూళ్ల), ఏలూరు శివరామకృష్ణ శర్మ (ఉయ్యూరు) కల్యాణ తంతు జరిపించారు. నూతనంగా నిర్మించిన అతిపెద్ద అనివేటి మండపం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం జాతర చివరి రోజు ఆలయ సమీపంలో తెప్పోత్సవం నిర్వహిస్తామని ఈఓ చెప్పారు.



కొల్లేటికోటలో పెద్దింట్లమ్మ అనివేటి మండపంలో కిక్కిరిసిన భక్తులు



జలదుర్గా, గోకర్ణేశ్వర స్వామి కల్యాణ దృశ్యం



గోకర్ణేశ్వర స్వామిని పల్లకిలో తీసుకువస్తూ..

క్లుప్తంగా

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి చర్యలు



ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసిన పదోన్నతి పొందిన హెచ్‌సీలు

ఏలూరు టౌన్: జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందని, ఒత్తిడి లేకుండా విధులు నిర్వర్తించేలా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ సంక్షేమ దివస్ చేపట్టారు. జిల్లాలోని పోలీస్ సిబ్బంది శాఖాపరంగా ఎదుర్కొంటున్న ఆయా సమస్యల పరిష్కారానికి ఎస్పీ చర్యలు తీసుకున్నారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పోలీస్ వెల్ఫేర్ డే ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందినవారు మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహూకరించారు. ఎస్పీని కలిసిన వారిలో హెడ్ కానిస్టేబుళ్లు పెయ్యల విజయ్‌కుమార్, కురెళ్ళ కృష్ణంరాజు, బొడవుల నాగశ్రీను, ఉలిసి శ్రీనివాస్‌లు ఉన్నారు.

యాప్‌లతో చిటికెలో పరిష్కారం

- ఎన్నికల ఫిర్యాదులు, సమాచారం కోసం ఏడు యాప్‌లు
- ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహణ







భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చేసింది. ఎన్నికల్లో సామాన్య పౌరులను సైతం భాగస్వాములను చేస్తూ ఎన్నికల కమిషన్ పలు రకాల యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. సీ విజిల్, సువిధ, కెవైసీ, అబ్జర్వర్, సాక్ష్యం, ఓటరు హెల్ప్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుకు, ఎన్నికల నియమావళి, ఓటర్లుకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించి సమాచారం తెలుసుకోడానికి ఇవి ఉపయోగపడతాయి.

సీ విజిల్

ఈ యాప్‌లో ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా పొందుపర్చవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకు అతీతంగా ఎవరు ఉల్లంఘటనకు పాల్పడినా ఫిర్యాదు చేయవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ ఫోను నంబరు ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం ఇలా ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో క్లిప్‌గా అప్‌లోడ్ చేయాలి. యాప్ తెరవగానే ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. యాప్‌లో వివరాలు పొందుపర్చగానే జిల్లా ఎన్నికల అధికారి 5 నిమిషాల్లో దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

సువిధ యాప్

ఇది ఎన్నికల సమయంలో అభ్యర్థులకు నామినేషన్ అనుమతి ప్రక్రియలో సహాయం చేయడానికి అభివృద్ధి చేసిన అప్లికేషన్. సువిధ క్యాండిడేట్ యాప్‌ను ఉపయోగించడానికి, అభ్యర్థులు ఖాతాను రిజిస్టర్ చేసుకుని వారి ఆధారాలతో లాగిన్ చేయాలి. తర్వాత, అభ్యర్థులు తమ నామినేషన్ల అనుమతిని చూడవచ్చు. సువిధ క్యాండిడేట్ యాప్ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తుంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు. అనుమతి అప్లికేషన్ ట్రాక్ చేయొచ్చు.

ఓటరు హెల్ప్‌లైన్ యాప్

ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో జనాభా వివరాలు, ఎలక్టోరల్ రోల్‌లో మీ పేరును సెర్చ్ చేయడం, ఓటు వేయడానికి అర్హత ఉన్నారో లేదో తనిఖీ చేయడానికి యాప్‌ని ఉపయోగించవచ్చు. డిజిటల్ ఫొటో ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన వార్తలు, అప్‌డేట్‌లు పొందవచ్చు.

కేవైసీ యాప్

మీ అభ్యర్థిని తెలుసుకోవడానికి, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్ర గురించి తెలుసుకోవడంలో ఈ యాప్ ఉపయోగపడుతుంది. అభ్యర్థిపై క్రిమినల్ కేసుల వివరాలు, ఆ కేసుల స్థితి, నేరాల స్వభావం ఉంటాయి. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను గుర్తించడానికి, వారికి ఓటు వేయకుండా ఉండటానికి ఓటర్లకు సహాయపడుతుంది.

అబ్జర్వర్ యాప్

ఇది ఎన్నికల కోడ్ దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించిన కేసులను తెలుసుకోడానికి పరిశీలకులకు ఉపయోగపడుతుంది. యాప్‌ను ఉపయోగించడానికి పరిశీలకులు ముందుగా ఖాతాను సృష్టించి వారి కోడ్, పాస్‌వర్డ్‌తో సమాచారాన్ని అందించాలి. అబ్జర్వర్ యాప్ సాయంతో అక్రమాలను అడ్డుకోవడానికి అనుమతిస్తుంది. తమ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ స్టేషన్ల సంఖ్య, ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం వంటి సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

సాక్షం యాప్

దివ్యాంగులకు సేవల కోసం దీన్ని తీసుకొచ్చారు. ఈ యాప్‌తో పోలింగ్ రోజున వీల్ చైర్ కోసం రిక్వెస్ట్ చేయొచ్చు. దివ్యాంగులు ఓటు వేయడానికి నమోదు చేయడానికి, వారి పోలింగ్ స్టేషన్ తెలుసుకోడానికి, ఓటు వేయడానికి సహాయం చేసేలా అనేక ఫీచర్లను అందిస్తుంది. దృష్టి లోపం ఉన్న దివ్యాంగుల కోసం వాయిస్ సహాయాన్ని అందిస్తుంది. టెక్స్ట్-టు-స్పీచ్ అందిస్తుంది. దివ్యాంగులకు ఉపయోగపడేలా అనేక ఫీచర్లు ఉన్నాయి.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కరించడానికి ఈసీకి సహాయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఓటరు వారి మొబైల్ నంబర్‌ను ఉపయోగించి పోర్టల్‌లో వారి ప్రొఫైల్‌ను నమోదు చేసుకోవచ్చు. ఇందులో ఓటరు తమ ఫిర్యాదును నమోదు చేయొచ్చు. ఓటరు ఫిర్యాదు చేసిన తర్వాత, అది విచారణ కోసం ఎన్నికల అధికారికి వెళ్తుంది. ఎన్నికల అధికారి నిర్ణీత వ్యవధిలోగా స్పందించాల్సి ఉంటుంది. పోలింగ్ బూత్ స్థానాలు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, ఎన్నికల అక్రమాలు వాటికి సంబంధించి ఫిర్యాదులను సకాలంలో ఈ యాప్ పరిష్కరిస్తుంది. పౌరులు తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో ట్రాక్ చేయొచ్చు.

కొండపల్లిలో మరో సైబర్ నేరం

బాధితుడి ఖాతా నుంచి రూ. 55 వేలు మాయం

కుక్కునూరు: కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామంలో శుక్రవారం మరో సైబర్ నేరం చోటుచేసుకుంది. జిల్లా అధికారినంటూ కొండపల్లి గ్రామానికి చెందిన మిడియం రాంబాబు అనే వలంటీర్‌కు నేరగాడు ఫోన్ చేసి ప్రభుత్వ స్కీంలో నగదు జమకాని వారి వివరాలు సేకరించాడు. కుమ్మరపల్లి స్వరూప అనే మహిళకు అమ్మ ఒడి జమ కాలేదని తెలుసుకున్నాడు. అనంతరం ఆమె నెంబర్‌కు వలంటీర్ ఫోన్ నుంచి కాన్ఫరెన్స్ కాల్ కనెక్ట్ చేసి ఆమెతో మాట్లాడి ఫోన్‌పే నెంబర్ అడిగాడు. ఆమె ఫోన్‌పే లేదని చెప్పడంతో ఆమెకు సంబంధించిన ఎవరిదైనా ఫోన్‌పే నెంబర్ ఇస్తే అమ్మ ఒడి నగదు జమచేస్తానని నమ్మించాడు. అది నిజమేనని నమ్మిన స్వరూప గ్రామంలోని ఓ షాపు యజమాని వద్దకు వెళ్లి అతని ఫోన్ నెంబర్ ఇచ్చింది. దీంతో షాపు యజమానికి సైబర్ నేరగాడు ఫోన్ పే మెసేజ్ పంపాడు. ఆ మెసేజ్ క్లిక్ చేసి అందులో పే ఆప్షన్ క్లిక్ చేయడంతో అతని ఖాతా నుంచి రూ.55 వేలు మాయమయ్యాయి. తన ఖాతా నుండి డబ్బు కాజేసిన విషయం గ్రహించిన బాధితుడు కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం సాయంత్రం ఉప్పేరు గ్రామానికి చెందిన వలంటీర్‌కు సైబర్ నేరగాడు ఫోన్ చేసి జిల్లా అధికారినని చెప్పి ప్రభుత్వ స్కీంకు సంబంధించి ఖాతాలో నగదు జమ కాని వారికి నగదు జమచేస్తామని నమ్మబలికి పల్లం సంధ్య అనే మహిళ వివరాలు సేకరించి ఆమె ఖాతా నుంచి రూ. 83 వేల నగదు కాజేశాడు. ఈ నేపథ్యంలో ఫోన్ పేలో ప్రభుత్వ పథకాల నగదు వేస్తానంటూ ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మవద్దని.. అతనికి ఎలాంటి వివరాలు ఇవ్వవద్దని పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా పొలిమేర



ఏలూరు (టూటౌన్) : వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఏలూరుకు చెందిన పొలిమేర హరికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన వెలువరించింది. ఏలూరు 44వ డివిజన్ వైఎస్సార్‌సీపీ పార్టీ ఇన్‌చార్జిగా హరికృష్ణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని సిఫార్సు మేరకు తనకు ఈ పదవి కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకు పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, పామర్రు ఎమ్మెల్యే అనిల్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

28 నుంచి జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు



విలేకర్లతో మాట్లాడుతున్న నిర్వాహకులు

నూజివీడు : కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షుడిగా 40 ఏళ్ల పాటు పనిచేసిన దివంగత బొబ్బిలి కొండలరావు జ్ఞాపకార్థం పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలో ఈ నెల 28 నుంచి31 వరకు జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రముఖులు రామిశెట్టి మురళీకృష్ణ, పగడాల సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని పైడి అప్పారావు మర్చంట్ హాల్‌లో శుక్రవారం మాట్లాడుతూ ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఆటతీరును కనబరుస్తున్న ఆరు పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. టోర్నమెంట్ విజేతకు రూ.75 వేలు, రన్నర్‌కు రూ.50 వేలు, మూడో స్థానానికి రూ.30 వేలు, నాలుగో స్థానానికి రూ.20 వేలు నగదు బహుమతిని అందజేస్తామన్నారు. సమావేశంలో స్పోర్టింగ్ క్లబ్ సెక్రటరీ తిరుమలశెట్టి వెంకట కృష్ణారావు, బొబ్బిలి వెంకటప్పయ్య, కోటగిరి సతీష్, బొబ్బిలి శ్రీనివాస్, ఏకేడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నౌషద్



తాడేపల్లిగూడెం (టీఓసీ): వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎస్కే నౌషద్ మొహిద్దీన్‌ను నియమించారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సిఫార్సు మేరకు ఈ నియామకం జరిగింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, డిప్యూటీ సీఎం సత్యనారాయణకు నౌషద్ కృతజ్ఞతలు చెప్పారు. ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చెప్పి రానున్న ఎన్నికలలో ఘన విజయం సాధించేందుకు కృషి చేస్తానని వివరించారు. తాడేపల్లిగూడెంకు చెందిన ముగ్గురు ముస్లింలకు జిల్లా కమిటీలో పదవులు దక్కాయి. జిల్లా సెక్రటరీగా సయ్యద్ ఖాన్ పఠాన్, సభ్యులుగా ఎండీ సిరాజుద్దీన్, ఎండీ అబ్దుల్ సిరాజ్ నియమితులయ్యారు.

అభయాంజనేయస్వామి హుండీ లెక్కింపు

పెదపాడు : అప్పనవీడు శ్రీ అభయాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.12,58,970 వచ్చినట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద యనమదల రామస్వామి సత్రం ప్రాంగణంలో 71 రోజులకు లెక్కింపు జరిపారు. ఆర్‌ఆర్ పేట వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓ సన్యాసిరావు పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులో ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

భుజబలపట్నంలో 7 కాసుల బంగారం చోరీ



చోరీ ఘటనను పరిశీలిస్తున్న రూరల్ ఎస్‌ఐ రామకృష్ణ

కైకలూరు: భుజబలపట్నం గ్రామంలో పట్టపగలు ఏడు కాసుల బంగారం చోరీకి గురైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాట్ల ప్రభావతి పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తోంది. ఆమె ఉదయం 8 గంటలకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికొచ్చింది. బీరువా తాళం పగలుకొట్టి ఉండటం గమనించింది. పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా.. ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేసి ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేలేరుపాడు : హత్య ఘటనలో వేలేరుపాడు మండలంలోని తూర్పుమెట్ట గ్రామానికి చెందిన చిచ్చడి కృష్ణ(45) గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివాహేతర సంబంధం అనుమానంతో కృష్ణ తలపై ఈ నెల 19వ తేదీ రాత్రి గొడ్డలితో కురసం వెంకటేష్ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత రెండు రోజులుగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కృష్ణ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మరణించాడు. అతని మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కేసులో వెంకటేష్‌ను శుక్రవారం రిమాండ్ చేసినట్లు వేలేరుపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉత్కంఠగా టెన్నిస్ టోర్నమెంట్



75 ప్లస్ డబుల్స్ సెమీఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

భీమవరం: భీమవరం కాస్మొపాలిటన్ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సీనియర్ ప్లేయర్లు హోరాహోరీగా తలపడుతున్నారు.

35 ప్లస్ విభాగం : క్వార్టర్ ఫైనల్స్‌లో సీ కిరణ్‌పై డాక్టర్ ఎస్.పట్నాయక్ 2-6, 1-6 స్కోరుతో విజయం సాధించగా, కలైమణి కన్నన్‌పై ఈశ్వర్ సాయి 0-6, 1-6 స్కోరుతో, జానకి రామరాజుపై ఎన్‌డీ విజయ్ ఆనంద్ 0-6, 1-6 స్కోరుతో గెలుపొందారు.

45 ప్లస్ విభాగం: క్వార్టర్ ఫైనల్స్‌లో కానూరి బుజ్జిపై ఆర్.మణి కన్నన్ 2-6, 0-6 స్కోరుతో, రాజాపై ఎన్.బాబు 1-6, 0-6 స్కోరుతో గెలుపొందారు.

55 ప్లస్ విభాగం : క్వార్టర్ ఫైనల్స్‌లో సి.ముని కృష్ణారెడ్డిపై డి.హేమంత్ కుమార్ 3-6, 2-6 స్కోరుతో, బిశ్వజిత్ రాయ్‌పై డి.సుధాకర్ రెడ్డి 3-6, 1-6 స్కోరుతో విజయం సాధించారు.

65 ప్లస్ విభాగం : డబుల్స్ సెమీ ఫైనల్స్‌లో వి.గజపతి, ఎస్.ఎ.రజాక్‌పై వి.ధనుంజయులు, ఎస్.మన్మథరావు 2-6,1-6 స్కోరు తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరారు.

75 ప్లస్ విభాగం : డబుల్స్ సెమీఫైనల్స్‌లో డాక్టర్ చంద్రశేఖర్, ఎం.సాయి రాంబాబుపై ఎ.రాంబాబు, ఎస్.సేతు 6-2, 2-6, 6-10 తేడాతో విజయం సాంధించి ఫైనల్స్‌కు చేరారు.

పరీక్షా కేంద్రంలో నిబంధనలు బేఖాతరు

మాస్ కాపీయింగ్ అనుమానాలు



పెనుగొండ 10వ తరగతి పరీక్షా కేంద్రం చైతన్య స్కూలు వద్ద వెనుదిరిగి వెళ్తున్న ఉపాధ్యాయులు

పెనుగొండ: పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద అధికారులు నిబంధనలకు నీళ్లొదిలారు. పెనుగొండలోని చైతన్య పాఠశాలను 10వ తరగతి పరీక్షా కేంద్రంగా ఎంపిక చేయడంతో శుక్రవారం గణితం పరీక్ష నిర్వహించారు. ఉదయం పరీక్ష నిర్వహిస్తుండగా, మధ్యాహ్నం చైతన్య పాఠశాల తమ విద్యార్థులకు రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తోంది. నిబంధనల ప్రకారం పరీక్ష పూర్తయితే గానీ పరీక్షా కేంద్రంలోకి ఇతరులు ఎవరూ ప్రవేశించకూడదు. దీనికి విరుద్ధంగా పాఠశాల సిబ్బంది పరీక్ష జరుగుతుండగానే స్కూలుకు చేరుకొని పాఠశాలలోకి ప్రవేశించారు. ఈ నేపథ్యంలో మాస్ కాపీయింగ్ చేసేందుకే వెళ్లారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో మీడియా కూడా పాఠశాలకు చేరుకోగా, అధికారులు హుటాహుటిన పాఠశాల సిబ్బందిని బయటికి పంపించివేశారు. పరీక్షా కేంద్రంలోకి పరీక్ష జరుగుతున్న సమయంలో ప్రైవేటు పాఠశాల సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా పంపించడం అధికారుల తప్పు కాగా.. పరీక్ష జరుగుతున్న సమయంలో పాఠశాల కేంద్రంలోకి వెళ్లకూడదని తెలిసినా పాఠశాల సిబ్బంది లోపలికి వెళ్లడం మరో తప్పు. మీడియా వచ్చిన తర్వాత వారిని హడావుడిగా బయటికి పంపించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికారులు మాత్రం వారు పరీక్షకు సంబంధం లేని హాలులోనే కూర్చున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎంఈవో డి.శుభాకరరావు తెలిపారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. ఉద్రిక్తత

పెనుగొండ పోలీస్‌స్టేషన్‌పై దాడి



పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన ఆందోళనకారులు

పెనుగొండ: ఇన్‌స్టాగ్రాం చాటింగ్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం రాత్రి ఆచంటకు చెందిన కె.సూర్యపాల్ తన ఇన్‌స్టాగామ్‌లో చాటింగ్ చేస్తూ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఆగ్రహించిన దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. పోలీసులు సూర్యపాల్‌ను అర్ధరాత్రి ఆచంట నుంచి పెనుగొండ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు పెనుగొండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ముట్టడించారు. వాగ్వాదం పెరగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కేసు నమోదు చేసి సూర్యపాల్‌పై చర్యలు తీసుకుంటామని పోలీసులు సర్దిచెప్పినా పరిస్థితి సద్దుమణగలేదు. కొందరు యువకులు ఆగ్రహంతో పోలీస్‌స్టేషన్‌పై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో సీసీ కెమెరాలు, టేబుళ్లు ధ్వంసమయ్యాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి గుంపును చెదరగొట్టడంతో పాటు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. నర్సాపురం డీఎస్పీ జి.శ్రీనివాస్ శుక్రవారం ఉదయం పెనుగొండ పోలీస్ స్టేషన్ వద్ద పరిస్థితిని సమీక్షించారు. శుక్రవారం సాయంత్రం వరకు 23 మందిని గుర్తించి అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు పెనుగొండ ఎస్సై ఎస్‌కే సుభానీ తెలిపారు.

ఉద్యమాన్ని ఆపలేరు

తమ ఉద్యమాన్ని అరెస్టులతో ఆపలేరని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ హెచ్చరించారు. ఉద్యమాన్ని ఆపడం కోసం గృహనిర్బంధం చేయడంతో పాటు కొందరిపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు.

కేసు నమోదు

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఘటనలో ఆచంటకు చెందిన బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

విధుల్లో అలసత్వం వద్దు



ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఓ వెంకటరమణ

అత్తిలి: విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తణుకు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి వెంకటరమణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళి , సి విజిల్‌యాప్ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ ఎ తాతారావు, ఎంపీడీవో వీవీఎస్ రామారావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అత్తిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఎంపీయూపీ స్కూల్స్‌లో పోలింగ్ కేంద్రాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని రిటర్నింగ్ అధికారి వెంకటరమణ పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



దర్శిపర్రులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో చెన్నయ్య, తహసీల్దార్ సురేష్‌బాబు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు, దర్శిపర్రు, రాచర్ల గ్రామాల్లో పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డీవో చెన్నయ్యతో, పెంటపాడు తహసీల్దార్ సురేష్‌బాబులు పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్య, అతి సమస్మాత్మక గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ శాతం, అక్కడి ఉన్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌లలో ఓటరు లిస్టులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గూడెం డీటీ శివశంకర్, ఆర్‌ఐ కనకదుర్గ, ఏఎస్‌వో భార్గవి, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో కవి ప్రసాద్ ప్రతిభ



కవి ప్రసాద్‌ను సత్కరిస్తున్న పీఠం నిర్వాహకులు

తణుకు: అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరుకు చెందిన పట్టాభి కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ రచించిన తిరిగి ప్రాణప్రతిష్ఠ చేయాలి అనే కవితకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ రావి రంగారావు, పొత్తూరి సుబ్బారావు, టి.సేవకుమార్, బండికట్ల జమదగ్ని చేతుల మీదుగా కవి ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం



పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ జయవరపు లక్ష్మి సద్భావన పర్యటనలో భాగంగా శుక్రవారం క్లబ్ వారిచే నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ, బియ్యం పంపిణీ, వికలాంగురాలు కుటుంబానికి కిరాణా సరుకులు, బహిరంగ ప్రదేశాల్లో కూర్చువడానికి 2 బెంచీలు, పేద వ్యాపారికి తోపుడు బండి రిక్షా అందజేశారు. ఉచిత హోమియా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నున్న ఆనంద్, సీహెచ్‌వీఆర్ గుప్తా, రంగా, పి.స్వర్ణకాంతి, కె.రాణి, పి.కోటేశ్వరీ, ఆలపాటి అచ్యుతలక్ష్మి, నున్న శ్రీ నాగలక్ష్మి, నున్న సుందరం, పులవర్తి రాంపండు, పి.పద్మ, సుజాత, ఎం.కుమారి తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధ్యక్షుడు రొక్కాల నాగ బుజ్జి తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీషు క్లాస్‌లు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 63056 83467ను సంప్రదించాలని కోరారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

- తణుకులో మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌ల ద్వారా వైద్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న నివాసితులు
- ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యుడు, ఆరుగురు సిబ్బంది



తణుకు బ్యాంక్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన అర్బన్ హెల్త్ సెంటర్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే క్రమంలో తణుకు పట్టణంలో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్ల సేవలు విరాజిల్లుతున్నాయి. ప్రజల చెంతకే వైద్యశాల అందుబాటులో ఉండాలనే మంచి ఉద్దేశ్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తణుకు పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్‌లను నూతనంగా ఏర్పాటు చేశారు. వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంతో నడుస్తున్న తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి పట్టణ నడిబొడ్డున రోగులకు వైద్య సేవలు అందిస్తుండగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణానికి మూడు వైపులా మరొక మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌లు అందుబాటులో ఉన్నాయి. హెల్త్ సెంటర్‌ల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలతోపాటు ఉచితంగా రక్త పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి. స్థానిక నివాసితులు హెల్త్ సెంటర్‌లలో వైద్యసేవలు పొందుతుండగా మెరుగైన సేవల కోసం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్తున్నారు.

రూ. 80లక్షలు నిధులతో అర్బన్ హెల్త్‌సెంటర్

తణుకు పట్టణ పరిధిలో 2 లక్షలకు పైగా జనాభా ఉండగా ఇప్పటివరకు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మాత్రమే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తణుకు బ్యాంక్ కాలనీలో రూ. 80 లక్షలు నిధులతో నూతనంగా నిర్మాణం చేసి ప్రారంభించిన అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్థానిక నివాసితులకు వైద్యసేవలు అందుతున్నాయి. తణుకు పాతవూరు కొమ్మాయి చెర్వు ప్రాంతంలో కమ్యూనిటీ భవనంలో నూతనంగా ఏర్పాటుచేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌లో కూడా వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఒక్కొక్క వైద్యుడు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, డేటా ఆపరేటర్, సహాయకుడుతో కలిపి ఏడుగురు చొప్పున రెండు సెంటర్‌లలోను అందుబాటులో ఉన్నారు. తణుకు ఎన్జీవో కాలనీలో ఒక అర్బన్ హెల్త్ సెంటర్ అందుబాటులో ఉంది.

వైద్యానికి ప్రాధాన్యతనిచ్చిన సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి ఎంతో ప్రాధాన్యతనిస్తూ వైద్యసేవలను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తణుకు పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఏర్పాటుకు కృషిచేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన పేదవర్గాలు దూరప్రయాణం చేయాల్సిన అవసరం లేకుండా అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఉన్న వైద్యుల వద్ద వైద్యసేవలు పొందుతున్నారు.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు, తణుకు

అర్బన్ హెల్త్ సెంటర్లు ఆదరిస్తున్నాయి



పట్టణంలో అందుబాటులో ఉన్న మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌ల ద్వారా పేదలకు మంచి వైద్యసేవలందుతున్నాయి. హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా వైద్యులతోపాటు సిబ్బందిని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దూరంగా ఉన్న ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పేదవర్గాలకు మంచి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.

– రేలంగి రాంబాబు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు

ఉచితంగా రక్తపరీక్షలు, మందులు



తణుకు బ్యాంక్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌లో పేదవర్గాలకు ఖరీదైన వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యుడితోపాటు సిబ్బంది మంచి సేవలందిస్తున్నారు. వైద్యసేవలే కాకుండా ఉచితంగా రక్తపరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తుండడంతో బ్యాంక్ కాలనీ వాసులు వైద్యసేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– మండ సూరిబాబు, 17వ వార్డు ఇన్‌చార్జి, తణుకు

ఆకుతీగపాడులో విద్యార్థుల శ్రమదానం



ఆకుతీగపాడులో రోడ్లపై చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

పెంటపాడు: మండలంలోని ఆకుతీగపాడు గ్రామంలో పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సోషల్ ఎకనామిక్స్ సర్వే చేశారు. వారం రోజులపాటు నిర్వహించే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఐదోరోజు శుక్రవారం గ్రామంలో విద్యార్థులు రోడ్లను శుభ్రం చేశారు. ఆకుతీగపాడుతో పాటు, సమీపంలోని రావిగుంట ప్రాంతంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయబాబు, కమిటీ సభ్యులు సురేంద్రబాబు, రామచంద్రుడు, అధ్యాపకులు జాన్‌బాబు, కళాశాల సిబ్బందితో పాటు, గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, యోగా గురువు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా నేర్పించారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి



హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నివాసాల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీటి నిల్వలు దోమలకు నిలయాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు వీకర్స్‌కాలనీ, కడకట్ల, యాగర్లపల్లిలో 1, 2, 19, 20, 21, 22, 31, 32 వార్డుల్లో శుక్రవారం ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలు, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలు, ర్యాలీలు, క్షేత్రస్థాయిలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో పెరుగుతున్న లార్వాను గుర్తించి వాటిని నిర్మూలించాలన్నారు. ప్రతి వారం డ్రై డే, ఫ్రై డే నిర్వహించడం వల్ల దోమ లార్వాను నిర్మూలించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కాంతారావు, రామకృష్ణ, ప్రసాద్‌బాబు, ఆరోగ్య కార్యదర్శులు వెంకట లక్ష్మి, రజనీ, రమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదనగోపాలస్వామి పొన్నవాహన గ్రామోత్సవం



పొన్నవాహన గ్రామోత్సవంలో గోవింద స్వామి నృత్యాలు



బల్లిపాడులో మదనగోపాలస్వామివారి పొన్నవాహన గ్రామోత్సవ దృశ్యం

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి పొన్నవాహన గ్రామోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన పొన్నవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి బ్యాండు మేళాలు, కాళికామాత, గోవింద స్వామి నృత్యాల నడుమ గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుగట్టుపై కాల్చిన బాణా సంచాకాల్పులు భక్తులను ఆకట్టుకుంది. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించి తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్‌లు ధనుమూరి తాతాజీ, ఆకుల బులినాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు ప్రజావ్యతిరేకం



తణుకులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

తణుకు: బీజేపీ విధానాలు ప్రజానీకానికి, సమాజానికి వ్యతిరేకమని, కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. తణుకు ఎన్జీవో హోంలో సీఐటీయు ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో ఒక్క భారీ పరిశ్రమను కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కూడా విదేశీ కంపెనీ దక్షిణకొరియా పోస్కోకు కట్టబెట్టాలని, నూరు శాతం అమ్మాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. పదేళ్ల కాలంలో అభివృద్ధి కాకపోవడానికి విభజన చట్టంలో ఉన్న అంశాలు అమలు చేయకపోవడం ప్రధాన కారణమన్నారు. ప్రత్యేక హోదా వస్తే కొన్ని పన్ను రాయితీలు వస్తాయన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని, రైతాంగ వ్యతిరేక ప్రభుత్వమని, కార్మికులకు లేబర్ కోడ్లను తీసుకువచ్చి స్వాతంత్ర్యం ముందు నుంచి ఉన్న హక్కులను లేకుండా కాలరాయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, నాయకులు నీలాపు ఆదినారాయణబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం



పార్టీలో చేరుతున్న జనసైనికులను ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: భీమవరం నియోజవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మెంటే వారి తోటకు చెందిన పలువురు జనసైనికులు శుక్రవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన చేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి కూడా ఆర్థిక భరోసా కల్పిస్తూ మరో ప్రక్క 25 లక్షల వరకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యాన్ని అందజేస్తున్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మరిన్ని బృహత్తర కార్యక్రమాలను శాశ్వత ప్రాతిపదికన చేపట్టడానికి ప్రణాళికలను తయారు చేయడం జరిగిందన్నారు. ఇటువంటి సమయంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, భీమవరంలో తనకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాభాలకు అండగా ఉండాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో కానూరు శ్రీను, కానూరి బాలాజీ, బొడ్డు సాయి , పెనుమాల బాలాజీ, సన్నీ, అఖిల్, బల్లం మనోహర్, పెచ్చెటి షణ్ముఖ్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, ముత్యాల రామారావు, అంజిబాబు, కోయ మణికంత, చెల్లబోయిన సూర్య ప్రకాష్, చెలంకూరి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి బూత్ కమిటీలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, తదితరులు

తణుకు టౌన్: రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి గ్రామ స్థాయిలోని బూత్ కమిటీ సభ్యులు సైనికుల్లా పని చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు కోరారు. శుక్రవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం కొమరవరం, తేతలి గ్రామాల్లో జరిగిన బూత్ కమిటీలతో సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తేతలిలో జరిగిన కార్యక్రమానికి గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా బోడపాటి వీర్రాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో ఐదురుగు సభ్యులతో ప్రతి ఇంటింటికి వెళ్లి ఆకుటుంబానికి ఈ ఐదేళ్లలో వచ్చిన సంక్షేమ పథకాల గురించి, లబ్ధి గురించి వివరించాలన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే ఎందుకు రాలేదో వివరాలు తెలుసుకుని గెలిచిన తర్వాత తప్పకుండా తమ సమస్యలు పరిష్కారిస్తామని చెప్పాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో ఈప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు మాట్లాడుతూ తేతలి గ్రామంలో 2019లో పార్టీకి వచ్చిన మెజారిటీ కంటే అధికంగా ఈసారి ఎన్నికల్లో సాధించేలా గ్రామంలోని కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, సొసైటీ అధ్యక్షుడు పేరిచర్ల సతీష్ రాజు, నాయకులు కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, దారం శ్రీను, వీరవల్లి పూర్ణ, సత్యనారాయణ, దొంగ భీమ చంద్రరావు, ఎం సంపదరావు, నక్కా ధనరాజు, వెంకటేశ్వరరావు, రాజన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొమరవరంలో..

తణుకు రూరల్ మండలం కొమరవరం, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు గ్రామాలకు చెందిన బూత్ కమిటీ సభ్యులతో కొమరవరం గ్రామంలో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్, గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, మహాలక్ష్మీ చెరువు గ్రామ సర్పంచ్ పాలా శ్రీను, యర్రాయి చెరువు నాయకులు సత్యనారాయణ, నాయకులు గంటా శ్రీనివాస్, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్షలలో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో టౌన్, రూరల్, పెంటపాడుల్లో నాల్గోవ రోజు శుక్రవారం లెక్కల పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 18 సెంటర్‌ల్లో పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగింది. 3857 మంది విద్యార్థినీ, విద్యార్థులకు గాను 3466 మంది హాజరైయారు. 391 మంది పరీక్షలకు హాజరుకాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీవైఈఓ కార్యాలయం సిబ్బంది వెల్లడించారు.

నేడు అత్తిలిలో మంత్రి కారుమూరి పర్యటన

అత్తిలి: నేడు అత్తిలి మండలంలో పలు గ్రామాల్లో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం మంచిలి, కంచుమర్రు, స్కిన్నెరపురం గ్రామాల్లో, మధ్యాహ్నం కొమ్మర, ఈడూరు, పాలూరు గ్రామాల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

గూడెంలో పోలీసుల కవాతు



జువ్వలపాలెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెం అర్బన్ : నియోజకవర్గంలో ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంతమైన వాతారణాన్ని కల్పించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు ముందుకురావాలని సీఐ ఎసుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక జువ్వలపాలెం నుంచి పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వరకు కేంద్ర భద్రతా బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటున్న ప్రతి వ్యక్తి ప్రలోభాలకు గురికాకుండా భయం, పక్షపాతం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలపై ఉన్న అభిమానంతో ఇతర పార్టీలకు చెందిన క్యాడర్‌ను దూషించటం , నేతలపై అసత్య ప్రచారం చేయటం, ఆయా వర్గాల మధ్య వైషమ్యాలు, గొడవలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా మరింత పెంచారని, అసాంఘిక శక్తులకు అవకాశం లేకుండా ప్రజలు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుధాకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

భీమవరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన అన్నారు. కళాశాల విద్యార్థులకు నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్ లెవెల్ క్రీడాపోటీలు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, 100 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూయువకేంద్రం వలంటీర్ నక్కా దివ్యతేజ, కళాశాల పీడీ ఎస్‌డీవీ సత్యనారాయణ, పి అరవింద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి

భీమవరం: వేసవిలో కూలీలకు ఉపాధి కల్పిస్తున్న పంట, మురుగు కాలువల పక్షాలన పనులను యథావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందచేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా మార్చి నెలలో ముమ్మరంగా పనులు జరిగేవని ఈ ఏడాది అధికారుల నిర్ణయం వల్ల పనులు సక్రమంగా గ్రామాల్లో చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఎక్కువ రోజులు పని దినాలు కల్పించి కనీస వేతనం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని సత్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో కవురు పెద్దిరాజు, సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావులు ఉన్నారు.

వైభవంగా ఉమా వైద్యనాథేశ్వరస్వామి కల్యాణం

యలమంచిలి: మండలంలోని పెనుమర్రులో ఉన్న శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. యాజ్ఞిక బ్రహ్మ బాదంపూడి చిరంజీవిశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం రాత్రి దేవేరుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్మాత పొత్తూరి సోమరాజు, వెంకట సుబ్బలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, సాయంత్రం విశేష పంచదారాభిషేకం, రాత్రి శ్రీ వీరభద్ర భజన సమాజం వారితో భజన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగే కల్యాణోత్సవాలలో శనివారం రథోత్సవం, సదస్యము ఆదివారం జ్యోతి లింగార్చన, వసంతోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.